సాక్షి
పల్నాడు



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

ఫోన్‌పేలో రూ. 5 లక్షల వరకు విద్యుత్ బిల్లు చెల్లింపు

ప్రత్తిపాడు: విద్యుత్ వినియోగదారులు రూ. 5 లక్షల వరకు ఫోన్‌పేలో తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని గుంటూరు రూరల్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ బి.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించడం, బ్యాంక్‌లో చెక్కులు డిపాజిట్ చేయడంతో ఒకటి రెండు రోజులు ఆలస్యమయ్యేవని గుర్తుచేశారు. తద్వారా వినియోగదారుకు సర్‌చార్జీలు పడేవని తెలిపారు. సర్‌ఛార్జీలను బిల్లు ఇచ్చిన పదిహేను రోజుల్లోపు చెల్లిస్తే తరువాతి బిల్లులో రూ.150 వరకు కేటగిరీ–2 వినియోగదారులకు లాభం చేకూరుతుందన్నారు. ఇకనుంచి వినియోగదారులు ఫోన్‌పే ద్వారా ఇన్‌టైంలో విద్యుత్ బిల్లులను రూ.లక్ష నుంచి రూ. ఐదు లక్షల వరకు చెల్లించవచ్చన్నారు. తద్వారా వినియోగదారులకు సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో వృద్ధులకు ప్రత్యేక వార్డు



గుంటూరు మెడికల్: ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవంలో భాగంగా బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డును జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ప్రారంభించారు. ఆసుపత్రిలోని కుటుంబ నియంత్రణ విభాగంలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు 15 పడకలతో బేరియాట్రిక్ వార్డును ఏర్పాటు చేశారు. డెంటల్ విభాగంలో రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేసిన రేడియో విజియోగ్రఫీ ఎక్స్‌రే యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను, వార్డుల్లో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు.

సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. గుంటూరు జిల్లా జైలులో ఉన్న సోషల్ మీడియా కార్యకర్త వజ్రాల తారక ప్రతాప్‌రెడ్డిని బుధవారం ములాఖత్ ద్వారా ఆయన కలసి భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సోషల్ మీడియా యాక్టివిస్టులపై అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఎటువంటి పోస్టులు చేయకపోయినా పార్టీలో చురుగ్గా ఉన్న వారిపై కూడా పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేయించి, రాష్ట్రవ్యాప్తంగా అనేక మందిని జైళ్లకు పంపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదుకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన గాంధీ విగ్రహం సిద్ధం



తెనాలి: మహాత్మ గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని విజయవాడ గాంధీ హిల్‌లో ఆవిష్కరించేందుకు ధ్యాన గాంధీ విగ్రహం స్థానిక సూర్య శిల్పశాలలో రూపుదిద్దుకుంది. పది అడుగుల ఎత్తుతో తయారు చేసిన ఈ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు శిల్పులు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


విజయోస్తు



అమరావతిలో మహిషాసురమర్దిని అలంకారంలో బాల చాముండేశ్వరి



నరసరావుపేట ఈస్ట్ పరిధిలో మహిషాసురమర్దనిగా శ్రీశారదాంబ



క్రోసూరులో మహిషాసురమర్దనిగా వాసవీ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కారెంపూడి పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి



సత్తెనపల్లి త్రిశక్తిదుర్గా పీఠంలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం అమరావతిలోని శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వరాలయంలో బాల చాముండేశ్వరిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. నరసరావుపేట ఈస్ట్ పరిధిలో శ్రీశారదాంబ, క్రోసూరులో వాసవి మాత, కారెంపూడి పల్నాటి వీర్ల అంకాలమ్మ, సత్తెనపల్లిలోని త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దిని అలంకరణలో భక్తులను కటాక్షించారు. –అమరావతి/ నరసరావుపేట ఈస్ట్ /సత్తెనపల్లి/ క్రోసూరు/ మాచర్ల

ధర్మం గెలిచిన రోజు

సత్తెనపల్లి : హిందువులకు అతి ముఖ్యమైన పండుగల్లో విజయదశమి ఒకటి. భారతీయ సంప్రదాయంలో విశిష్టతను కలిగిన పర్వదినం. అసత్యం, అధర్మం ఎంత బలంగా ఉన్నా చివరికి ధర్మమే గెలుస్తుందనే శాశ్వత సత్యాన్ని గుర్తుచేసే ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. పురాణాల ప్రకారం... ఈ రోజున శ్రీరాముడు రాక్షసరాజు రావణుడిని సంహరించి సత్యం, న్యాయం నిలబెట్టాడు. మరొక వైపు, దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించి సత్యశక్తి పరాక్రమాన్ని ప్రదర్శించింది. అందుకే ఈ పర్వదినాన్ని విజయానికి గుర్తుగా భావిస్తారు.



వినుకొండలో మహిషాసురమర్దనిగా కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి

కొత్త ఉత్సాహం ఉప్పొంగేలా...

ఈ తొమ్మిది రోజుల ఉత్సవ సమాప్తి విజయదశమితో జరుగుతుంది. ఈ రోజునే మహిషాసురుడిపై దేవి విజయం సాధించింది. అందుచేత విజయదశమి అనేది కేవలం పండుగ మాత్రమే కాదు, ధర్మం గెలిచిన శాశ్వత సత్యానికి ప్రతీక. దసరా/విజయదశమి పర్వదినాన ఆయుధపూజ, విద్యారంభం, వాహనపూజ వంటి ఆచారాలు చేస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసం మొదలు పెట్టడం శుభప్రదమని నమ్మకం. రైతులు, కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు తమ సామగ్రి, వాహనాలు, పరికరాలను శుభ్రం చేసి పూజలు చేస్తారు. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది అత్యంత మంగళకరమైన రోజు. చాలామంది తమ కొత్త వ్యాపారాలను ఈ రోజే శ్రీదుర్గాదేవి పూజతో ప్రారంభిస్తారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఆయుధాలు, పుస్తకాలు, పరికరాలకు పూజలు చేసి, శమీ ఆకులను సువర్ణ లక్ష్మి ఆకులుగా భావించి పరస్పరం మార్చుకుంటారు. శరన్నవరాత్రుల అలంకారాల అందం, విజయదశమి ఆధ్యాత్మికత కలిసి భక్తులకు కొత్త ఉత్సాహం, ధైర్యం, విజయ విశ్వాసాన్ని నింపుతాయి. ఇది స్నేహం, శాంతి, ఐక్యతకు ప్రతీక. కష్టాలు ఎంత పెద్దవైనా మనకు విశ్వాసం, ధర్మం, పట్టుదల ఉంటే విజయం తప్పకుండా సొంతం అవుతుందనేది విజయదశమి పర్వదినం ప్రజలకిచ్చే సందేశంగా పెద్దలు చెబుతారు. అందుచే విజయదశమి ఉత్సాహాన్ని ఆస్వాదించి, సత్యం–ధర్మం పట్ల విశ్వాసం మరింత పెంచుకుందాం.

వివిధ అలంకరణల్లో..



పర్వదినం సందర్భంగా గత తొమ్మిది రోజులుగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి రోజూ అమ్మవారిని భక్తులు విభిన్న అలంకారాల్లో దర్శించారు. శ్రీరాజరాజేశ్వరి దేవిగా, గాయత్రి దేవిగా, శ్రీఅన్నపూర్ణ దేవిగా, శ్రీసంతానలక్ష్మీదేవిగా, శ్రీకాత్యాయనీదేవిగా, శ్రీధనలక్ష్మిగా, శ్రీమహాదుర్గాదేవిగా, శ్రీవారాహిదేవిగా, శ్రీసరస్వతీదేవిగా, శ్రీమహాకాళీదేవిగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ నవరూపాల దివ్యారాధనతో భక్తులు తమ భయాలు, అడ్డంకులు, కష్టాలను తొలగిపోవాలని ప్రార్థించారు. రోజూ అమ్మవారిని రకరకాల పుష్పాలతో, అలంకారాలతో, శోభాయమానంగా తీర్చిదిద్దడం ఆలయాలకు, ఇళ్లకు, పండుగ వాతావరణానికి ప్రత్యేక ఆకర్షణ. దేవి రూపాల దివ్య రంగుల వెలుగులు భక్తుల మనసుల్లో భక్తిభావం నింపాయి. పండుగ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. రాత్రివేళలో విద్యుత్ అలంకరణలతో శోభాయమానంగా కాంతులీనుతూ కనిపించాయి. రోజూ అమ్మవారికి పూజలు, తీర్థప్రసాదాలతోపాటు రాత్రి వేళ్లలో సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులకు సత్కాలక్షేపాన్ని అందించారు.

ప్రభుత్వ ఆదేశాలనే ఉల్లంఘిస్తున్న అధికారులు

- బుచ్చిపాపన్నపాలెం సొసైటీని గోగులపాడుకు మార్చడం తగదు
- పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి
- కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేత

నరసరావుపేట: ప్రభుత్వ భవనాలు ఉన్నచోటే సొసైటీలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వమే జీఓ ఇచ్చిందని, అధికారులు మాత్రం దీనిని ఉల్లంఘించడం మంచి సంప్రదాయం కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రొంపిచర్ల మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో సొంత భవనంలో 35 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న సొసైటీని గోగులపాడు గ్రామంలోని అద్దెభవనంలోకి మార్చటాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నూతనంగా నియమితులైన అధ్యక్షుడు బాధ్యతలు తీసుకున్నాక సొసైటీని గోగులపాడు గ్రామానికి మార్చాలని సొసైటీ సెక్రెటరీపై తీవ్రంగా ఒత్తిడిచేశారని, పలు కంప్యూటర్లను అక్కడకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఏదైనా సొసైటీలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతుంటే వాటిని కూడా ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. బుచ్చిపాపన్నపాలెం సొసైటీ ప్రభుత్వ భవనంలోనే ఉందని, దీనిని తీసుకెళ్లి గోగులపాడు గ్రామంలోని అద్దె భవనంలోకి మారుస్తున్నారని, ఇలా నిబంధనలు ఉల్లంఘించటం తగదని అన్నారు. యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు. డీఎల్‌సీఓ తిరుపతయ్యను కలసి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు గజ్జల ముసలారెడ్డి, పానుగోటి వెంకటరావు, మాజీ సర్పంచ్ చీమల శ్రీనివాసరెడ్డి, పాలూరి పేరిరెడ్డి, రాజనాల నాగిరెడ్డి, బీరం రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతాలోపాలు

- రిటైర్డ్ డీఈపై చర్యలు
- పెన్షన్‌లో మూడేళ్లపాటు 15 శాతం కోత

నాదెండ్ల: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతాలోపాలు నిజమని తేలటంతో సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. 2017–18లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు రూ.40 లక్షల పంచాయతీరాజ్ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మించారు. పనులు నాసిరకంగా ఉన్నాయంటూ 2020లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాణాలు పాటించలేదని నిర్ధారించారు. అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా వ్యవహరించిన కేశవరావుకు చార్జ్‌మెమో జారీ చేశారు. కాంట్రాక్టర్‌కు చెల్లించిన బిల్లులో కోత విధించారు. 2024లో కేశవరావు ఉద్యోగ విరమణ చేశారు. తాజాగా కేశవరావుపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పింఛను నుంచి మూడేళ్లపాటు 15 శాతం చొప్పున జరిమానాగా కోత విధించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా చండీకల్యాణం



అమరేశ్వరాలయంలో చండీకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండిక సమేత అమరేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి చండీకల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి, స్వామివారికి ఎదుర్కోల మహోత్సవం జరిగింది. ఆలయంలోని వెంకటాద్రినాయుని మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారిని ఉంచి ఆలయ అర్చకులు కౌశిక చంద్రశేఖరశర్మ యాజ్ఞీక పర్యవేక్షణలో అర్చకులు విఘ్నేశ్వర పూజ, రక్షాబంధనం, పుణ్యాహవాచనం, కన్యాదానం, శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. ఏటా రెండుసార్లు అనగా మహాశివరాత్రి, దసరాకు కల్యాణం నిర్వహించటం సంప్రదాయమని అర్చకులు పేర్కొన్నారు.

జిల్లాలో భూగర్భజలాలు సంరక్షించాలి

అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట: జిల్లాలో భూగర్భ జలాలను సంరక్షించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో చెరువులు నింపడం, భూగర్భ జలాలు పెంపు వంటి అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, భూగర్భజల శాఖ, డ్వామా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట కుంటల తవ్వకం, చెక్ డ్యామ్‌లు, నీటి కుంటల నిర్మాణం, చెరువుల పూడికతీత, చెరువుల అభివృద్ధి, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను నింపటం వంటి సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను పాటించటం ద్వారా నీటి సంరక్షణ సాధ్యమన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ , డ్వామా పీడీ లింగమూర్తి, మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వసతులు కల్పించండి

ఔత్సాహిక క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో కలసి సత్తెనపల్లిరోడ్డులోని అన్నా క్యాంటీన్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా స్టేడియాన్ని ఆమె పరిశీలించారు. వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌లతోపాటు వివిధ నిర్మాణాలు చేపట్టాలని శాప్ అధికారులను ఆదేశించారు. అన్నా క్యాంటీన్‌లో భోజనాన్ని పరిశీలించారు. ప్రకాష్‌నగర్‌లోని 12వ వార్డు షాలెంనగర్‌లో మురుగునీటి కాలువను పరిశీలించారు. పూడికతీతకు ఆదేశాలిచ్చారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును ఆదేశించారు. బాపనయ్య 11వ వార్డు సచివాలయాన్ని పరిశీలించారు. నూతన జీఎస్టీ రెండు శ్లాబుల విధానంతో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్డీఓ కె.మధులత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.





ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి



నరసరావుపేటలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

నరసరావుపేట టౌన్: న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కరించి వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మమత ప్రియ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు బుధవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ కోటా తగ్గించింటంతో వైద్యులు నైపుణ్యాన్ని పెంచుకొనే అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ జీఓ నెం. 99 ద్వారా పీజీ ప్రవేశాల్లో 20 శాతం ఉన్న కోటాను 15 శాతానికి తగ్గించటమే కాకుండా కేవలం ఏడు బ్రాంచ్‌లకే పరిమితం చేయటం అన్యాయమన్నారు. సంఘ నాయకులు డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల నుంచి పదోన్నతులు లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. మొదట దీక్ష శిబిరం వద్ద నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు హనుమకుమార్, రమ్య, జగన్‌నరసింహారెడ్డి, రాధా కృష్ణణ్, ప్రదీప్, బాల అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటు


- దానికి బదులు అమరావతి ప్రైవేటీకరణ చేయొచ్చు కదా?
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల



గురజాల మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

పిడుగురాళ్లరూరల్: రాజధాని నిర్మాణం పేరిట రూ.లక్షల కోట్లతో జేబులు నింపుకొంటూ, పేదల కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొని వచ్చిన వైద్యకళాశాల, హాస్పటళ్లను ప్రైవేటుకు అప్పగించడం ఏంటని.. ఇదేనా మీ విజనరీ అంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.శ్యామల సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లి గ్రామంలోని మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. శ్యామల మాట్లాడుతూ... 2019లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మొదటి బడ్జెట్టులోనే గురజాల నియోజకవర్గానికి నిధులు కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులు, రోగులకు ఉపయోగపడే వైద్య కళాశాలలు, ఆస్పత్రులను ప్రైవేటు పరం చేస్తుందని.. దానికి బదులుగా అమరావతిని ప్రైవేటీకరణ చేయొచ్చుకదా అని ప్రశ్నించారు. హోం మంత్రి అనిత పెద్ద ప్రజెంటేషన్ చేసి కాలేజీల నిర్మాణం చేపట్టలేదని చెబుతున్నారని, అయితే ఒక్కసారి గురజాల వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. మెడికల్ కాలేజీ భవనాలను కళ్లతో చూస్తూ కూడా నోటితో అబద్ధాలు చెబుతున్నారని శ్యామల దుయ్యబట్టారు. 17 కాలేజీలలో ఏడు కాలేజీలను జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పూర్తి చేశారని, మిగతా 10 కాలేజీలను పూర్తి చేయలేక ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం రాజధాని ఎలా పూర్తి చేస్తారని ఆమె ప్రశ్నించారు. సర్పంచ్‌లు చల్లా శివారెడ్డి, షేక్ బడేషా, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ ఇల్లూరి వెంకట రామిరెడ్డి, జిల్లా యూత్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ చల్లా రంగారెడ్డి, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ షేక్ మాబు, గురజాల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సాంబశివరావు, వలంటీర్ విభాగం అధ్యక్షులు అంచూరి తరుణ్‌రెడ్డి, కత్తి సాగర్‌బాబు, బండి ప్రసాద్‌రెడ్డి, నంద్యాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







నల్ల బ్యాడ్జీలు ధరించి పెన్షన్ల పంపిణీ



సత్తెనపల్లి: జిల్లాలో సచివాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. వలంటీర్ విధులు తమకు వద్దని, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నిరసన తెలియ జేస్తూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,72,735 పెన్షన్లకు గాను బుధవారం సాయంత్రం 5:30 గంటల వరకు 2,51,240 మందికి పెన్షన్లను పంపిణీ చేశారు. 92.12 శాతం పంపిణీ పూర్తయింది. ఇంకా 21,495 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అత్యధికంగా సత్తెనపల్లి పట్టణంలో 94.89 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేయగా అత్యల్పంగా దుర్గిలో 89 శాతం మందికి పంపిణీ జరిగింది. ఇది ఇలా ఉంటే రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామంలో పెన్షన్ల పంపిణీలో జరిగిన లోటుపాట్లపై లబ్ధిదారులు అంతా ఒకే చోటకు చేరి గంటల తరబడి నిరీక్షించి ఇబ్బందులు పడటంతో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మండిపడ్డారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌డీఓ రాజగోపాల్, మండల అధికారులు అనుపాలెం గ్రామానికి చేరుకొని పెన్షన్ల పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించారు.









గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం

నకరికల్లు: ఈతకు వెళ్లి గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. మండలంలోని గుండ్లపల్లి సమీపంలోని ఎన్నెస్పీ మెయిన్ కెనాల్‌లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు గల్లంతైన విషయం పాఠకులకు విదితమే. చిలకలూరిపేటకు చెందిన షేక్ అర్షద్(17), చీరాల మండలం ఆంధ్ర కేసరి నగర్‌కు చెందిన దరబడి మార్క్ రూఫస్(17)ల మృతదేహాలను మండలంలోని శివాపురంతండా సమీపంలో సాగర్ కెనాల్‌లో గుర్తించారు. అతికష్టం మీద మృతదేహాలను వెలికితీశారు. ఎస్ఐ కె.సతీష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

బాలుడి మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగింత

యడ్లపాడు: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి క్వారీ కుంటలో దిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన దాసరిపాలెంకు చెందిన బాలుడు షేక్ మాబు(15) మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. గతనెల 30వ తేదీన మండలం పరిధిలోని చౌడవరం గ్రామ శివారులోని క్వారీకుంటలో జరిగిన ఈ ప్రమాదంలో మృతి చెందిన మాబు మృతదేహాన్ని యడ్లపాడు పోలీసులు ఆదేరోజు రాత్రి 10.45 వెలికి తీసిన విషయం తెలిసిందే. వెంటనే మృతదేహాన్ని చిలకలూరిపేట అర్బన్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. బుధవారం మాబు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాస్పిటల్ వద్దకు రావడంతో రోదనలు మిన్నంటాయి. తల్లి మరియంబి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న దృశ్యం చూపరులకు కంటతడి పెట్టించింది. పోస్టుమార్టం అనంతరం మాబు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో దాసరిపాలెంలోని అంత్యక్రియలు నిర్వహించారు.







